నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, బుధవారం 29 మే 2024 | MEDAK

మంత్రికి రైతుల కష్టాలు పట్టవా?

రైతులు ధర్నాలు చేస్తున్నా దామోదర జాడలేదు

- విత్తనాల కోసం రైతులు క్యూలో పాస్ పుస్తకాలు ఉంచుతున్నారు
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శ

మాట్లాడుతున్న చంటి క్రాంతికిరణ్

సంగారెడ్డి, మే 28(నమస్తే తెలంగాణ) : అందోలు నియోజకవర్గంలో రైతులు విత్తనాల కోసం ధర్నాలు చేస్తున్నా మంత్రి దామోదర రాజనర్సింహ జాడ కనిపించడం లేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అందోలు నియోజకవర్గంలోని రైతులు జనుము, జీలుగ విత్తనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వారం రోజుల క్రితం జోగిపేటలో జీలుగ విత్తనాల కోసం రైతులు ధర్నా చేశారన్నారు. మంగళవారం చౌటకూరు, పుల్కల్‌లోనూ రైతులు జీలుగ విత్తనాల కోసం క్యూలో పట్టాదారు పాసుపుస్తకాలను ఉంచి పడిగాపులు పడినట్లు తెలిపారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ తన నియోజకవర్గ కేంద్రమైన అందోల్‌లో రైతులు విత్తనాల కోసం ఆందోళనలు చేస్తున్నా స్పందించకపోవడం తగదన్నారు. ఇంతవరకు జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి ఎందుకు సమీక్ష నిర్వహించలేదని క్రాంతికిరణ్ ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ పేరు కారణం చూపుతూ మంత్రి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కొత్తగా చేపట్టే పనులకు ఎన్నికల కోడ్ నిబంధనలు వర్తిస్తాయని, ఏటా వానకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అవసరం అవుతాయని, వీటి గురించి మంత్రి సమీక్ష జరిపి అధికారులకు సూచనలు చేస్తే ఎన్నికల కోడ్ ఎందుకు అడ్డుగా వస్తుందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో రైతులు ఏనాడూ విత్తనాలు, ఎరువుల కొరత చూడలేదన్నారు. సీజన్‌కు ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేదన్నారు. అప్పటి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రితో పాటు జిల్లా మంత్రి హరీశ్‌రావు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు జరిపి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్ పాల్గొన్నారు.

కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు


సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మే 28: తెలంగాణ రాష్ట్రం ఎవరో బిచ్చమేస్తే వచ్చింది కాదని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో సబ్బండ వర్గాల ప్రజలు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాల సాయిరాం అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై నిందలు వేయడం మాని పరిపాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలన్నారు. జూన్‌లోనే రైతుభరోసా సాయం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్‌లాల్, ఇర్షాద్ హుస్సేన్, మహిపాల్ గౌడ్, నరేందర్, బాబు జానీ, శ్రీనివాస్‌రెడ్డి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇకపై రైతుల నుంచి ఎకరాకు 12క్వింటాళ్ల జొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా సేకరిస్తామని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖల మంత్రి దామోదర రాజనర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 8క్వింటాళ్ల జొన్నలు మాత్రమే కొనుగోలు చేయడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి దామోదర తెలిపారు. ఇకపై 12 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. తాను రాసిన లేఖపై ప్రభుత్వం వెంటనే స్పందించి మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం జొన్న రైతులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి జొన్న రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి సస్పెన్షన్

సిద్దిపేట, మే 28 : సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి కె.శివప్రసాద్‌ను సస్పెన్షన్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో లింగ వివక్షత చూపడం, ప్రభుత్వ ఉద్యోగిగా అతనిపై అనేక ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తక్షణమే సస్పెన్షన్ అమలులోకి వస్తుందని, క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

చేపల కోసం చెరువు నీళ్లు ఖాళీ

- మంత్రి పొన్నం పేరు చెప్పి అధికారులకు కాంట్రాక్టర్ బెదిరింపులు
- ఆయకట్టు రైతుల ఆవేదనను పట్టించుకోని అధికారులు
- చెరువు నీళ్లు ఖాళీ అయితే బావులు పూర్తిగా ఎండిపోయి పశువులకు సైతం నీళ్లు దొరకని పరిస్థితి

అనుమతి లేకున్నా తూము ద్వారా నీటిని విడుదల చేసిన కాంట్రాక్టర్


సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువులో గండికొట్టి తూము ద్వారా నీటిని బయటకు వదులుతున్న దృశ్యం

చేపలు పట్టుకునేందుకు చెరువు నీళ్లను ఓ కాంట్రాక్టర్ ఖాళీ చేసే కుట్ర చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆయకట్టు రైతులు వచ్చి అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు తూము తెరవడంతో పాటు చెరువు లోపల గండికొట్టి తూములోకి నీళ్లు వచ్చేలా చేసి నీటిని బయటకు వృథాగా వదులుతున్నా పట్టించుకునేవారు లేరు. చెరువు ఎండిపోతే చుట్టుపక్కల బావులు, ఆయకట్టులోని బావులు పూర్తిగా ఎండిపోయి పశువులకు సైతం నీళ్లు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని తెలిసి కూడా ఓ కాంట్రాక్టర్ కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

హుస్నాబాద్, మే 28: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు ఈ ప్రాంతంలోనే అతిపెద్ద చెరువు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5వేల ఎకరాల ఆయకట్టు భూములకు చెరువు సాగునీరందిస్తున్నది. హుస్నాబాద్ పట్టణ వాసులకు కూడా ఈ నీళ్లే ఆధారం. ఇలాంటి చెరువు నుంచి పంటలకు కాకుండా వృథాగా నీటిని బయటకు వదలడంపై ఆయకట్టు రైతులతో పాటు పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోని చేపల కాంట్రాక్టు పట్టిన కాంట్రాక్టర్ తన స్వలాభంకోసం రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులకు మొరపెట్టుకున్నా చర్యలేవీ?

చెరువులోంచి అక్రమంగా నీటిని వదులుతున్నారని పలువురు ఆయకట్టు రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి 24గంటలు గడుస్తున్నా స్పందన కరువైంది. కాంట్రాక్టర్ జేసీబీతో కొట్టిన గండిన పూడ్చివేసి తూము ద్వారా నీళ్లు బయటకు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరినా అధికారులు స్పందించడం లేదు. ఉన్న కొద్దిపాటి నీరు బయటకు వెళ్లిపోతే తమ పశుపక్ష్యాదులకు నీళ్లు లేకుండా పోతాయని, ఈ ఏడు కూడా వానలు పడకుంటే మా పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టరు పెట్టిన గండిని ఇప్పటికీ అధికారులు పూడ్చకపోవడం విశేషం. వానలు పడి చెరువులోని కొత్త నీళ్లు వచ్చేదాక ఉన్న నీళ్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. మిషన్‌భగీరథ నీళ్లు సరిపోనప్పుడు చెరువులో గల బావి నుంచి నీళ్లను హుస్నాబాద్ పట్టణ వాసులకు సరఫరా చేస్తున్నారు. చెరువు ఎండిపోతే నీటి సరఫరా ఉండదని పట్టణ వాసులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి విడుదలను ఆపివేయాలని కోరుతున్నారు.

మంత్రి పేరు చెప్పి అధికారులను బెదిరిస్తున్న కాంట్రాక్టర్...

ఎల్లమ్మ చెరువులో చేపలు పట్టుకునే కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు చెప్పి నీటి పారుదల శాఖ అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్నాడని పేరు చెప్పడం ఇష్టం లేని ఓ అధికారి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. మంత్రి చెప్పినా నువ్వు నీళ్లను బయటకు వదలవా, నీ సంగతి చూస్తా అంటూ బెదిరిస్తున్నాడని, దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని సదరు అధికారి తన ఆవేదనను వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బంది కలుగుతుందని తెలిసినా కాంట్రాక్టరు తరపున మంత్రి ఎలా మాట్లాడుతాడనేది చర్చనీయాంశమైంది. వానకాలంలో వర్షాలు ఆలస్యంగా కురిసినా ఆయకట్టు రైతులకు ఉపయోగపడే చెరువు నీళ్లను బయటకు పంపాలని మంత్రి అధికారులకు ఎలా చెప్తాడనేది రైతులు చర్చించుకోవడం విశేషం. అవసరమైతే మంత్రిని కలిసి ఈ సంఘటన గురించి చెప్పేందుకు కూడా ఆయకట్టు రైతులు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.

తూములోంచి వృథాగా బయటకు పోతున్న చెరువు నీళ్లు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం..

చెరువుకు అక్రమంగా గండికొట్టి, తూము నుంచి నీటిని విడుదల చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేందుకు పైఅధికారులకు సమాచారం ఇచ్చాం. అనుమతి లేకుండా చెరువులో గండికొట్టడం నేరం. కాంట్రాక్టర్ కొట్టిన గండిని పూడ్చివేస్తాం. గండికొట్టడంతో పాటు తూము గేటును ఎత్తడం సరైంది కాదు. రైతులు మాకు ఫిర్యాదు చేసింది వాస్తవమే. ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–రాములునాయక్, నీటిపారుదల శాఖ ఈఈ

పశువులకూ నీళ్లు దొరకవు

హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులకు, ప్రజలకు ఎల్లమ్మ చెరువే ఆధారం. ఒకసారి నిండిందంటే రెండేండ్ల పాటు నీళ్లుంటయ్. ఒక కాంట్రాక్టరు కోసం వందలాది మంది ఆయకట్టు రైతులకు అన్యాయం చేయడం సరైంది కాదు. అధికారుల అనుమతి లేకుండా ఒక కాంట్రాక్టరు చెరువులో జేసీబీతో గండి కొట్టి నీళ్లను వదలాడంటే అధికారుల పనితీరు ఎలా ఉందో తెలుస్తున్నది. చెరువులో నీళ్లన్నీ బయటకు పోయి ఎండిపోతే మా పశువులకు నీళ్లు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గండిని పూడ్చివేసి ఉన్న నీటిని కాపాడాలని కోరుతున్నాం.

–బొలిశెట్టి రాజు, ఆయకట్టు రైతు, హుస్నాబాద్

అధికారులకు చెప్పినా..

ఎల్లమ్మ చెరువు తూము నుంచి వృథాగా బయటకు పోతున్న నీళ్లను ఆపాలని రైతులందరం కలిసి నీటిపారుదల శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. తూములోంచి 24గంటలు ఏకధాటిగా నీళ్లు పోతున్నయ్. గండిని పూడ్చి వేసి నీళ్లు పోకుండా చేయాలని చెప్పినా అధికారుల ఇప్పటి వరకు జాడ లేరు. తూములోంచి వచ్చే నీళ్లు పంటలకు కూడా పనికి రాకుండా పోతున్నయ్. అలాంటప్పుడు నీళ్లను ఎందుకు బయటకు వదలాలి. అధికారుల అండతోనే కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా నీళ్లను వదులుతున్నాడు. అధికారులు స్పందించి గండిని పూడ్చాలి.

–రాజయ్య, ఆయకట్టు రైతు,హుస్నాబాద్

మొత్తం జొన్నలు కొనాలి

- అడిషనల్ కలెక్టర్‌ను ఘెరావ్ చేసిన రైతులు
- కొనుగోలు చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని వెల్లడి


సంగారెడ్డి జిల్లా బీబీపేటలో అడిషనల్ కలెక్టర్‌ను ఘెరావ్ చేస్తున్న బీబీపేట రైతులు

కల్హేర్, మే 28: యాసంగిలో తాము పండించిన మొత్తం జొన్నలను కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యలు చేసకుంటామంటూ రైతులు సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురిని మంగళవారం ఘెరావ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని కల్హేర్, కృష్ణపూర్, జొన్నల కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ పరిశీలించి అనంతరం బీబీపేట కొనుగోలు కేంద్రానికి వెళ్లారు. ఈ క్రమంలో నెల రోజుల పైబడి జొన్నలు కేంద్రంలోనే ఉన్నాయని, కొనుగోలులో జాప్యం జరుగుతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో తూకం చేసిన 16వేల బస్తాలకు 8వేల బస్తాల జొన్నలను గోదాముకు తరలించారని తెలిపారు. కల్హేర్‌లో 5వేల బస్తాలు, కృష్ణపూర్‌లో 7వేల బస్తాలు ఉన్నాయని, వాటిని తరలించాలని రైతులు కోరారు. అందులో బీబీపేటకు చెందిన రైతుల 140 బస్తాలు నాణ్యత లోపం ఉందనే కారణంతో వెనక్కి తిరిగి పంపించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి జొన్న గింజనూ కొనుగోలు చేశారని రైతులు గుర్తుచేశారు. ఈనెల 31వ తేదీతో కొనుగోలు కేంద్రాలు మూసివేయబడతాయని అధికారులు చెప్పడంతో మిగిలిన ఆ జొన్నలను త్వరితగతిన కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో మార్క్‌ఫెడ్ డీఎం స్పందించి జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి ప్రతి జొన్నలను కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.

నకిలీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు

- రాబోయే 30 రోజులు కీలకం
- పోలీస్, వ్యవసాయశాఖలు సమన్వయంతో పనిచేయాలి
- అవసరమైతే పీడీయాక్ట్ ప్రయోగించాలి: సీపీ అనురాధ

సిద్దిపేటలో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న సిబ్బంది

మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట రూరల్, మే 28: నకిలీ విత్తన విక్రేతలను వదిలేది లేదని, ఎంతటి వారున్నా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. మంగళవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బందితో కమిషనరేట్‌లో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. దుకాణాలు, ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తే సహించేది లేదని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నకిలీ విత్తన తయారీలో ఎంతపెద్ద వారున్నా విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు రాబోయే 30 రోజులు వ్యవసాయశాఖ అధికారులను సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. గ్రామం, మండల స్థాయిలో నిఘా పెంచాలన్నారు. గత మూడేండ్లలో నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి గ్రామం నుంచి నకిలీ విత్తనాలపై సమాచారం అందేలా కమ్యూనికేషన్ పెంచుకోవాలని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించినట్లు తెలిస్తే డయల్ 100 లేదా 8712667100కు సమాచారం ఇవ్వాలని రైతులను, ప్రజలను కోరారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలకు రైతుల పడిగాపులు

మిరుదొడ్డిలోని రైతుసేవా కేంద్రం వద్ద జీలుగ విత్తనాలకు బారులు తీరిన రైతులు

దుబ్బాక పట్టణంలో జీలుగ విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

- అన్నదాతల అరిగోస
- జీలుగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల ముందు బారులు తీరుతున్న రైతులు
- క్యూలో పట్టాదారు పాసుపుస్తకాలు

దుబ్బాక/మిరుదొడ్డి/పుల్కల్/చౌటకూరు, మే 28: సరిపడా జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు లభించక పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీలుగ విత్తనాల కోసం మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని పుల్కల్, చౌటకూరు, దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాల్లోని రైతు ఆగ్రోసేవా కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించారు. వేకువజామునే వచ్చి క్యూలు కట్టారు. ఎండను సైతం లెక్క చేయకుండా గంటల పాటు నిరీక్షించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టి రైతులు పడిగాపులు కాశారు. దుబ్బాకలోని ఆగ్రోస్ కేంద్రానికి లారీ జీలుగ విత్తనాల బస్తాలు వచ్చాయి. కేవలం 167 మంది రైతులకు సరిపోవడంతో మిగతా రైతులు నిరాశతో వెనుదిరిగారు. చౌటకూర్‌లోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో రెండు గంటల్లోనే విత్తనాలు అయిపోవడంతో క్యూలైన్ ఉన్నప్పటికీ విత్తనాలు దొరకని రైతులు చేసేదేమిలేక నిరాశతో వెనుదిరిగారు. పుల్కల్ మండల కేంద్రంలోని రెండు ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాల వద్ద మంగళవారం జనుము, జీలుగ విత్తనాల కోసం రైతులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. రెండు ఆగ్రోస్ సేవా కేంద్రాలకు జనుము, జీలుగ విత్తనాలు వచ్చాయని తెలుసుకున్న రైతులు ఉదయం 6గంటలకే వచ్చి లైన్లు కట్టారు. ఒక కేంద్రంలో అయిపోయినవి అని తెలియగానే ఇంకో ఆగ్రోస్ కేంద్రం వద్దకు రైతులు భారీగా వచ్చారు. క్యూలో లేకపోతే జీలుగ విత్తనాలు దొరకవేమో అనుకొని రైతులు క్యూలో పట్టా పాస్‌బుక్కులు, ఆధార్ కార్డులను పెట్టారు. రెండు ఎకరాలకు ఒకటే బస్తాను ఇవ్వడంతో రైతులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. గంటల తరబడి లైన్లో నిలబడితే రెండకరాలకు ఒకటే బస్తానా అంటూ నిరాశకు గురయ్యారు. పాత రోజులు మళ్లీ వచ్చాయంటూ రైతులు అక్కడ మాట్లాడుకోవడం కనిపించింది. వ్యవసాయ శాఖ అధికారులు ఆగ్రోస్ కేంద్రం వద్ద ఉండి సీరియల్ ప్రకారం రైతులకు జీలుగ, జనుము విత్తనాలను అందజేశారు. మెదక్ జిల్లా కొత్తపల్లి రైతు వేదిక సహకార సంఘం వద్ద మంగళవారం జీలుగ విత్తనాల కోసం రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలతో పడిగాపులు కాశారు. మండలంలో సుమారు 28 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఏడాది 650 క్వింటాళ్లు మండల అవసరాల నిమిత్తం అవసరమని మండల వ్యవసాయ అధికారి కృష్ణ జిల్లా అధికారులకు నివేదిక పంపించారు. పాపన్నపేట లోని ఆగ్రో సెంటర్‌కు 150 క్వింటాళ్లు ,కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘానికి 223 క్వింటాళ్లు సరఫరా చేశారు. జీలుగ బస్తా ధర రూ.2790 ఉండగా, సబ్సిడీపై రూ.1116కు రైతులకు విక్రయిస్తున్నారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచే రైతులు పాపన్నపేటలోని ఆగ్రోస్ సర్వీస్ సెంటర్‌కు, కొత్తపల్లి సొసైటీ వద్దకు చేరుకున్నారు.కొత్తపల్లిలో రైతులు ఎక్కువగా ఉండడం, ఎండలు తీవ్రంగా ఉండటంతో రైతులు క్యూలో నిలబడలేక తమ వెంట తెచ్చుకున్న పాసు పుస్తకాలను లైన్లో ఉంచి గంటల తరబడి జీలుగ కోసం నిరీక్షించారు. చివరికి మధ్యాహ్నం విత్తనాలు పంపిణీ చేశారు. తగినన్ని విత్తనాలు దొరక్క పోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయంపై ఏఈ నాగకృష్ణను వివరణ కోరగా.. మండలానికి 380 క్వింటాళ్ల జీలుగ సరఫరా అయిందని తెలిపారు.

ఫేక్ రిజిస్ట్రేషన్ కేసులో పలువురికి రిమాండ్

మనోహరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

మనోహరాబాద్, మే 28 : తప్పుడు పత్రాలతో ఫేక్ రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో గతంలో నలుగురు, మంగళవారం సబ్ రిజిస్ట్రార్‌తో సహా నలుగురితో పాటు మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ జిల్లా మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మల్లవరపు అరుణ్‌కుమార్ అనే వ్యక్తి హైదరాబాద్ మోతీనగర్‌కు చెందిన సురావజ్జుల సత్యనారాయణ మూర్తి, అతని భార్య స్వాతికి మనోహరాబాద్ మండలం కూచారం శివారులోని సర్వే నెంబర్ 225, 226లో వెయ్యి గజాల స్థలాన్ని నకిలీ పత్రాలు సృష్టించి మరో 8 మందితో కలిసి రూ. 80 లక్షలకు విక్రయించాడు. అప్పటికే ఆ స్థలం అసలు యజమాని దుర్గా పేరిట రిజిస్ట్రేషన్ అయ్యి ఉంది. కాగా, నిందితులు హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ అనే మహిళకు డబ్బు ఎర చూపి, లక్ష్మి ఆధార్‌కార్డును దుర్గాగా మార్ఫింగ్ చేసి సురావజ్జుల సత్యనారాయణ మూర్తి, అతని భార్య స్వాతి పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. సురావజ్జుల సత్యనారాయణ మూర్తి, అతని భార్య స్వాతి లింక్ డ్యాకుమెంట్ల కోసం ఆరా తీయగా, అమ్మిన వ్యక్తులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. దీంతో వారు కొనుగోలు చేసిన ప్లాట్ వద్దకు వెళ్లి చూడగా, వేరే వ్యక్తుల పేరుతో బోర్డు ఉండటంతో తాము మోసపోయామని గ్రహించారు. దీంతో బాధితుడు సురావజ్జుల సత్యనారాయణ మూర్తి, అతని భార్య స్వాతి ఏప్రిల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్సై కరుణాకర్‌రెడ్డి గత నెలలో మొదటగా నలుగురిని, మంగళవారం తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ సనత్‌నగర్ రమణతో పాటు నలుగురిని మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ సనత్‌నగర్ రమణ మొదటి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎవరు వచ్చినా దురుసుగా మాట్లాడడం, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఫేక్ రిజిస్ట్రేషన్‌లో సైతం తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ సనత్‌నగర్ రమణ భారీగా డబ్బులు ముడుపుగా అందుకున్నట్లు సమాచారం.